క్లుప్తంగా

కిక్కిరిసిన వేంకటేశ్వరుని ఆలయం



అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో కొలువైన వేంకటేశ్వరస్వామివారి ఆలయం శనివారం భక్తులతో కిక్కిరిసింది. స్వామికి ఆలయ ప్రధానార్చకుడు చక్రవర్తుల విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో విశేషాభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి కానుకలు, మొక్కులు చెల్లించారు. చిన్నారులకు తులాభారం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి అన్న ప్రసాదం స్వీకరించారు. అలాగే అయినవిల్లి విఘ్నేశ్వరుని ఆలయానికి కూడా భక్తులు పోటెత్తారు.

తల్లిపాలతో బిడ్డకు ఆరోగ్యం

అంబాజీపేట: తల్లిపాలు బిడ్డకు రోగనిరోధక శక్తినిస్తాయని సర్పంచ్ తరపట్ల మోహన్‌సింగ్ బాబురావు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ బి.అప్పారావు అన్నారు. తల్లిపాల వారోత్సవాలు పురస్కరించుకుని ఇసుకపూడిలో అంగన్‌వాడీ కేంద్రం వద్ద బాలింతలకు తల్లిపాల విశిష్టతపై శనివారం అవగాహన కల్పించారు. తల్లులకు చిన్నారుల పోషణ, తల్లిపాల ఆవశ్యకత, శిశువుల ఆరోగ్యం తదితర విషయాలను తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశాలు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యమైన జీవనం

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో గత మూడు నెలల నుంచి జరుగుతున్న స్వామి వివేకానంద యోగా ఆశ్రమంలో ఉచిత యోగా శిక్షణ తరగతులను గ్రామస్తులు వినియోగించుకుంటున్నారు. యోగా జీవితంలో ఒక భాగం కావాలన్నారు. రోజు యోగాసనాలు చేయడం వల రక్తప్రసరణ బాగుంటుందన్నారు. యోగాతో చాలా వ్యాధులకు దూరంగా ఉండవచ్చని యోగా శ్రీనివాస్ అన్నారు ఈ శిక్షణ తరగతుల్లో రాష్ట్రపతి అవార్డు గ్రహీత ఇంటర్నేషనల్ జడ్జి యోగా గురువు మోటూరి భైరవస్వామి నల్లచెరువు గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్నారు.

టీడీపీని బలోపేతం చేస్తాం

మామిడికుదురు: టీడీపీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేసే దిశగా కార్యాచరణ చేపట్టామని పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్ పేర్కొన్నారు. నగరంలో పార్టీ కార్యకర్తల సమావేశం గ్రామశాఖ అధ్యక్షుడు జాలెం సుబ్బారావు అధ్యక్షతన శనివారం జరిగింది. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుంచే పార్టీ శ్రేణులను సమాయత్తం చేయాలని శ్రీనివాస్ సూచించారు. విధిగా గ్రామశాఖ సమావేశాలు ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో పార్టీ నేతలు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు

అంబాజీపేట: విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేస్తేనే ప్రతి ఉపాధ్యాయుడికి ఎళ్లవేళలా గుర్తింపు ఉంటుందని హెచ్‌ఎం కడలి సాయిరాం అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను శనివారం ఘనంగా సత్కరించారు. ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ ఎంఈఓ 2గా పదోన్నతి పొందిన మోకా ప్రకాష్‌ను, వివిధ హైస్కూళ్లకు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు ఎంఎన్ శ్రీనివాస్, ఎం.బాలశంకరరావు, ఎస్.సుధాకరబాబు, కేఎస్‌ఎన్ రామంలను సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోర్టు తీర్పుపై హర్షం

అంబాజీపేట: రాహుల్ గాంధీకి విధించిన జైలు శిక్షపై సుప్రీంకోర్టు స్టే విధించడంపై మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. అంబాజీపేటలో పలువురు వక్తలు మాట్లాడుతూ ప్రస్తుత తీర్పుతో ప్రజలకు న్యాయ వ్యవస్థపై గౌరవం పెరుగుతుందన్నారు. బీజేపీ బెదిరింపులకు భయపడమన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ సర్టిఫికెట్‌తో మెరుగైన అవకాశాలు

ఆలమూరు: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు నేషనల్ క్యాడెట్ సర్టిఫికెట్ (ఎన్‌సీసీ) ఉన్నత ఉద్యోగ అవకాశాల కల్పనకు దోహదపడుతుందని ఆలమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.అప్పాజీ అన్నారు. స్థానిక పాఠశాల ఆవరణలో శనివారం ఆరవ ఆంధ్ర నావెల్ యూనిట్ కాకినాడ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కమాండర్ హరిప్రీత్‌సింగ్ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ విద్యార్థుల ఎంపిక జరిగింది. ఎన్‌సీసీ ఏఎన్ఓ పి.వెంకట్రావు పర్యవేక్షణలో బాలబాలికలకు రన్నింగ్ పోటీలు నిర్వహించి దారుఢ్యత కలిగిన 35 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు పి.సత్యనారాయణ, వి.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

వివిధ అభివృద్ధి పనులపై సమీక్ష

ఆత్రేయపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శనివారం మండలంలోని జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులపై ఇంజినీరింగ్ అధికారులు, అసిస్టెంట్లతో ఎంపీడీఓ నాతి బుజ్జి సమీక్ష నిర్వహించారు. ఆగస్టు నెలాఖరు నాటికి సచివాలయం భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈఓ వరప్రసాద్, మండల పరిషత్ పర్యవేక్షకుడు టీవీ సురేంద్రరెడ్డి, ఏఈ డి.వీరభద్రరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఆర్బీకేలు.. రైతు నేస్తాలు

- ఆర్బీకేల ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు
- పెరిగిన పంట దిగుబడులు
- మద్దతు ధరకు ధాన్యం సేకరణ

అంబాజీపేట: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టగానే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయ రంగంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. వ్యవసాయ రంగాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక పథకాలు అమలు చేస్తూ రైతులకు వెన్నుదన్నుగా రైతును రాజుగా నిలబెట్టింది. గ్రామస్థాయిలో రైతుభరోసా కేంద్రాల (ఆర్బీకే)లను ఏర్పాటు చేసి రైతు వద్దకే సేవలను చేరుస్తోంది. పంటలు వేసేందుకు అవసరమైన పెట్టుబడి సాయాన్ని ప్రభుత్వమే సమకూరుస్తోంది. అంతేకాకుండా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించి సాగుపై అన్నదాతలకు భరోసా కల్పిస్తోంది. రైతు ఉత్పత్తులకు ప్రభుత్వం మద్దతు ధర లభించేలా ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేస్తోంది. నాలుగేళ్లుగా ప్రకృతి కూడా అనుకూలించడంతో ప్రతి రైతు పొలంలో వ్యవసాయం పండగలా సాగవుతోంది. రుణమాఫీ, మద్దతు ధర, కొనుగోళ్ల వరకూ అన్నింటిలోనూ అన్నదాతలను అప్పటి టీడీపీ ప్రభుత్వం మోసగించింది. మిల్లర్లతో మిలాఖత్ అయి మొక్కుబడిగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల నడ్డి విరిచింది. ఇపుడు ఆర్బీకేల ద్వారా రైతుల చెంతకే సేవలు వ్యవసాయంలో విత్తు నుంచి పంట విక్రయం వరకూ రైతన్నలకు అన్ని విధాలుగా తోడ్పాటు అందించేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన అద్భుత వ్యవస్థ ఆర్బీకేలు. ఈ ఆర్బీకేల ద్వారా ప్రతి గ్రామంలో రైతుల చెంతకే సేవలు అందిస్తున్నారు. అంబాజీపేట మండలంలో 19 రైతు భరోసా కేంద్రాల పరిధిలో 6,200 మంది రైతులు, 13 వేల ఎకరాల్లో ప్రధానంగా వరితో పాటు వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. ఆర్బీకేల్లోనే డిజిటల్ కియోస్క్ ద్వారా సర్టిపై చేసిన నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులను బుక్ చేసుకున్న గంటల్లోనే రైతుల ముంగిట అందిస్తున్నారు. ఆర్బీకేలకు అనుబంధంగా యంత్ర సేవా కేంద్రాలు, నియోజకవర్గ స్థాయిలో ఇంటిగ్రేటెడ్ అగ్రిల్యాబ్స్ ఏర్పాటు చేశారు. ప్రతి ఎకరాలో సాగయ్యే పంటల వివరాలను ఈ–క్రాప్ ద్వారా నమోదు చేయడం, ఈ డేటా ఆధారంగా పైసా భారం పడకుండా పంటల బీమా, పెట్టుబడి రాయితీ, సున్నా వడ్డీ, పంట రుణాలు వంటి సంక్షేమ ఫలాలు రైతులకు అందిస్తున్నారు. రైతులకు పగటి పూటే నాణ్యమైన 9 గంటల ఉచిత విద్యుత్తు సరఫరా చేస్తున్నారు.



మాచవరం రైతు భరోసా కేంద్రం

మండలంలో నాలుగేళ్లుగా రైతులకు అందిన లబ్ధి

వైఎస్సార్ రైతు భరోసా ద్వారా	రూ.30.05 కోట్లు
వైఎస్సార్ సున్నా వడ్డీ సాయం	రూ.16.93 లక్షలు
వైఎస్సార్ ఉచిత పంటల బీమా	రూ.66.15 లక్షలు
పంట నష్టపరిహారం	రూ.79.19 లక్షలు
యంత్రసేవా పథకం ద్వారా	రూ.52.30 లక్షలు

ఆర్బీకేలతో రైతులకు మేలు



ఆర్బీకేలతో రైతులకు ఎంతో మేలు జరుగుతోంది. ప్రభుత్వ సేవలపై రైతులకు విశ్వసనీయత పెరిగింది. ఈ–క్రాప్ చేయడం ద్వారా పంటలు నష్టపోయిన రైతులకు సాయం అందుతోంది. దళారుల ప్రమేయం లేకుండా రెండేళ్లుగా ఆర్బీకేల ద్వారా ధాన్యం కొనుగోళ్లు పూర్తి స్థాయిలో చేపట్టడంతో రైతులకు గిట్టుబాటు ధర అందుతోంది.

– మద్దింశెట్టి మల్లిబాబు, రైతు, తొండవరం

కౌలు రైతులకు సకాలంలో సాయం



వైఎస్సార్ రైతు భరోసా ద్వారా ఏటా కౌలు రైతులకు రూ.13,500 చొప్పున సాయం అందిస్తున్నారు. పెరిగిన సాగు ఖర్చులతో ఇబ్బందులు పడుతున్న రైతులకు ఈ సాయం ఎంతో అండగా ఉంటోంది. ప్రభుత్వం అందించే యంత్రాలతో వ్యవసాయ రంగానికి మరింత మేలు జరుగుతోంది. ఆర్బీకేల ద్వారా పురుగుమందులు, ఎరువులను విక్రయిస్తున్నారు.

– కాకర భీమరాజు, రైతు, ఇసుకపూడి

జిల్లా దాటి.. పింఛన్ అందించి..



గౌరమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సురేష్

అంబాజీపేట: కంటికి ఆపరేషన్ చేయించుకుని విశ్రాంతి కోసం పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు మండలం పెదమల్లంకలో తన కుమార్తె ఇంటి వద్ద ఉంటున్న ఇసుకపూడికి చెందిన గూటం గౌరమ్మకు వద్ధాప్య పింఛన్‌ను వలంటీర్ పంతగాని సురేష్ శనివారం అందజేశారు. తన కుమార్తె ఇంటికి వెళ్లే మార్గం లేకపోవడంతో సురేష్ పాలకొల్లు నుంచి లంకలోకి గోదావరి నదిని పడవపై దాటి పింఛన్ అందజేశాడు. సుదీర్ఘ ప్రాంతంలో ఉన్న గౌరమ్మకు పింఛను అందజేయడంపై వలంటీర్ సురేష్‌ను సర్పంచ్ తరపట్ల మోహన్‌సింగ్ బాబూరావు, ఎంపీటీసీ ముత్తాబత్తుల ప్రశాంత్, సొసైటీ డైరెక్టర్ కోట విజయరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు అభినందనలు తెలిపారు.

ముంపు గ్రామంలో పారిశుధ్య పనులు

సఖినేటిపల్లి: ఏటిగట్టు దిగువన పూర్తి వరద ముంపు గ్రామం అప్పనరామునిలంకలో శనివారం పంచాయతీ సిబ్బంది పారిశుధ్య పనులు చేపట్టారు. సర్పంచ్ ఇందుకూరి సుబ్బరాజు, కార్యదర్శి కొండా బులిసూరన్న పర్యవేక్షించారు. మధ్యగ్రూపు, పల్లిపాలెం తదితర ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లే పనులను వారు పరిశీలించారు. సిబ్బంది, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయం



రావులపాలెంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

రావులపాలెం: గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన టేక్ హోం రేషన్ (టీహెచ్ఆర్)లో సంపూర్ణ పౌష్టికాహారం ఇస్తూ, పూర్తి స్థాయిలో ఆరోగ్యం అందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. శనివారం రావులపాలెం పార్కు వద్ద వేమన కల్చరల్ అసోసియేషన్ భవనంలో మండల స్థాయి వైఎస్సార్ పోషణ కిట్ల పంపిణీ కార్యక్రమం, గర్భిణులకు సామూహిక సీమంతాలను ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గర్భిణులకు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ గర్భిణులకు ఇచ్చే ఈ పోషకాహారంలో ఎక్కడా నాణ్యతలో రాజీ పడకుండా అందించాలని సీఎం ఆదేశాలు జారీ చేశారన్నారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ కర్రి లక్ష్మీవెంకట నాగదేవి, జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సాకా ప్రసన్నకుమార్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కర్రి వీర్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలమూరు: అంగన్వాడీల అందజేస్తున్న పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సాధించాలని పార్టీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, ఏజీపీ నామాల శ్రీనివాస్ అన్నారు. మండలంలోని చింతలూరు, చొప్పెల్ల, చెముడులంక గ్రామాల్లో శనివారం చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ జరిగింది. చింతలూరులో అర్హులైన 26 మంది లబ్ధిదారులకు రేషన్ కార్డులు పంచారు. దరఖాస్తు చేసిన వెంటనే రేషన్ కార్డులను మంజూరు చేసిన ప్రభుత్వానికి లబ్ధిదారులు కతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్‌లు దంగేటి చంద్రకళ, మార్గాని కరుణ, వైస్ ఎంపీపీ నేలపూడి రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట: స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద శ్రీకృష్ణ దేవరాయ సభా ప్రాంగణంలో శనివారం వైఎస్సార్ పోషణ కిట్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సీడీపీఓ పి.శారద అధ్యక్షతన జరిగిన సభలో ఎంపీపీ గంగాధరరావు, జెడ్పీటీసీ రమాదేవి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. అనంతరం 506 మంది గర్భిణులు, 432 మంది బాలింతలకు పోషణ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంబాజీపేట: కొర్లపాటివారిపాలెం సామాజిక భవనంలో మాచవరం పంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో సూపర్‌వైజర్ వీఎస్‌వీ మహాలక్ష్మి అధ్యక్షతన వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను శనివారం పంపిణీ చేశారు. 15 మంది గర్భిణులకు సీమంతం చేశారు. పార్టీ నాయకుడు సూదాబత్తుల రాము ఆధ్వర్యంలో 6 రకాల డ్రైఫ్రూట్స్‌ను గర్భిణులకు అందించారు. చిరతపూడిలో సర్పంచ్ కోట బేబిరాణి, ఇసుకపూడిలో సర్పంచ్ తరపట్ల మోహన్‌సింగ్ బాబూరావులు పోషణ కిట్లను గర్భిణులకు అందజేశారు.

మామిడికుదురు: పాశర్లపూడిలంకలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా శనివారం గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు వీటిని లబ్ధిదారులకు అందజేశారు. 20 మంది గర్భిణులు, 18 మంది బాలింతలకు అందజేశారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

సఖినేటిపల్లి: దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని కోనసీమ దివ్యాంగుల జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. శనివారం శృంగవరప్పాడులో జేఏసీ అధ్యక్షుడు బొమ్మిడి నరసింహస్వామి ఆధ్వర్యాన కమిటీ సభ్యుడు తోట ఆంజనేయులు అధ్యక్షతన పై సమావేశం జరిగింది. పింఛన్ రూ.మూడు నుంచి రూ.ఆరు వేలకు పెంచాలని, దివ్యాంగుల కుటుంబాలకు 35 కేజీల చొప్పున బియ్యం పంపిణీ చేయాలని, దివ్యాంగుల హక్కుల చట్టం 2016 అమలు చేయాలని సమావేశం తీర్మానించింది.

అంటువ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

అంబాజీపేట: ప్రస్తుత వాతావరణంలో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండి ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని సర్పంచ్ వాసంశెట్టి రేవతి, పార్టీ నాయకుడు వాసంశెట్టి పెదబాబులు అన్నారు. వక్కలంకలో సర్పంచ్ రేవతి పర్యవేక్షణలో పారిశుద్య కార్మికులు శనివారం శానిటేషన్ పనులు చేపట్టారు. అంటువ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్ చల్లించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

అన్ని పాఠశాలల్లో మాత్రలు పంపిణీ చేయాలి

సఖినేటిపల్లి: ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ప్రైవేటు పాఠశాలల్లో కార్యక్రమాలు చేపట్టాలని ఎంపీపీ వీరా మల్లిబాబు అన్నారు. శనివారం సఖినేటిపల్లి మానవవనరుల కేంద్రంలో ఈనెల 10న నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం వాల్‌పోస్టర్‌ను డాక్టర్ యూనస్‌తో కలసి ఆయన ఆవిష్కరించారు. ప్రభుత్వ పాఠశాలలతో పాటు, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు నులిపురుగుల మాత్రలు పంపిణీ చేయనున్నట్టు ఎంపీపీ తెలిపారు. ఎంఈవోలు, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు పాల్గొన్నాయి.

అర్హులకు సంక్షేమ పథకాలు చేరాలి

అంబాజీపేట: అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా సచివాలయ ఉద్యోగులు కృషి చేయాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. మాచవరం సచివాలయం–4ను ఎంపీడీఓ కె.సత్యనారాయణ, ఎంపీపీ వెంకటేశ్వరరావులు శనివారం పరిశీలించారు. ఎంపీపీ మాట్లాడుతూ లబ్ధిదారులు సచివాలయానికి వచ్చే సమయంలో వారికి అందుబాటులో ఉండి సహకరించాలన్నారు. సచివాలయంలో రోజూ సాయంత్రం నిర్వహించే స్పందనలో వచ్చిన ఫిర్యాదులు, సమస్యలపై స్పందించి ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. అనంతరం సచివాలయ ఉద్యోగులకు పలు సూచనలు చేశారు.

ఫుడ్ కమిషన్ సభ్యుడి విచారణ

మామిడికుదురు: అన్నంలో పురుగులు వస్తున్నాయంటూ పాశర్లపూడిలంక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు చేసిన ఆరోపణలపై రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు జక్కంపూడి కిరణ్ శనివారం విచారణ జరిపారు. పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడి సమస్య తెలుసుకున్నారు. హెచ్ఎం పర్యవేక్షణ లోపించడం వల్లే సమస్య ఏర్పడిందన్నారు. విద్యాశాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఫుడ్ కాంట్రాక్టర్‌ను వెంటనే మార్చాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. దీనికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖాధికారులకు సిఫారసు చేశామన్నారు.

జేసీబీతో బురద తొలగింపు

పి.గన్నవరం: వరదలు తగ్గడంతో రహదారులపై పేరుకుపోయిన బురదతో లంక గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించే బూరుగులంక రేవులో అడుగున్నర ఎత్తున బురద పేరుకుపోయింది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో గ్రామస్తులు శనివారం బూరుగులంక వైపున జేసీబీతో బురదను తొలగించి మార్గం ఏర్పాటు చేసుకున్నారు.

సీఎం జగన్‌కు మీ చల్లని దీవెనలు అందించండి



ఈదరాడలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాదరావు

మామిడికుదురు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మీ చల్లని దీవెనలు అందించి అతడ్ని ఆశీర్వదించాలని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు కోరారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం ఈదరాడలో జరిగింది. ఎమ్మెల్యే వరప్రసాదరావు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించి, ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. చరిత్రలో ఏ ప్రభుత్వం అమలు చేయని విధంగా సీఎం జగన్ అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారని చెప్పారు. తద్వారా ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సాధించారని పేర్కొన్నారు. ప్రతిపక్షాలు చెప్పే కల్లబొల్లి మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మట్టా శైలజ, ఎంపీపీ కుసుమ వనజకుమారి, సర్పంచ్ చుట్టుగుళ్ల లక్ష్మి, పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు యెరుబండి సత్యనారాయణమూర్తి, పార్టీ నేతలు బొలిశెట్టి భగవాన్, సూరిశెట్టి బాబి, యెరుబండి సూరిబాబు, కటకంశెట్టి ఆదిత్యకుమార్, చేట్ల సత్యనారాయణ, కాండ్రేగుల బంగారుశెట్టి, యెరుబండి శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

మామిడికుదురు: గోదావరి వరదల వల్ల పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం బృందం డిమాండ్ చేసింది. వరద ప్రభావిత గ్రామాల్లో శనివారం సీపీఎం పార్టీ బృందం పర్యటించింది. అప్పనపల్లిలో గోదావరి వరద వల్ల పాడైపోయిన అరటి తోటను పార్టీ రాష్ట్ర నాయకులు వి.హరిబాబు, అడ్ర మాల్యాద్రి, దడాల సుబ్బారావు, సూర్యనారాయణ, జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. పంట నష్టం నమోదులో జాప్యం జరగకుండా చూడాలన్నారు. నష్టం వివరాలను నమోదు చేసి ఆ జాబితాలను గ్రామ సచివాలయాల్లో ప్రదర్శించాలన్నారు. గోదావరి వరదల వల్ల తీర గ్రామాల్లో వరి, అరటి, కూరగాయలు, తమలపాకులు, తదితర పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. గత ఏడాది వరదలతో నష్టపోయిన రైతులకు ఇంత వరకు నష్ట పరిహారం చెల్లించకపోవడం దారుణమన్నారు. ఈ పర్యటనలో సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జి.దుర్గాప్రసాద్, పీతల రామచంద్రరావు, తాడి శ్రీరామ్మూర్తి, పీతల రాజశేఖర్ పాల్గొన్నారు.

పాశర్లపూడిలంక సొసైటీ చైర్మన్‌గా నరసింహమూర్తి



సొసైటీ చైర్మన్ నరసింహమూర్తిని అభినందిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: పాశర్లపూడిలంక సొసైటీకి ముగ్గురు సభ్యులతో పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీని నూతనంగా నియమించారు. సొసైటీ చైర్‌పర్సన్‌గా మాజీ సర్పంచ్ బొరుసు నరసింహమూర్తి (బుజ్జి)ని నియమించారు. పర్సన్స్‌గా కుడుపూడి సత్యనారాయణ, యల్లమెల్లి శ్రీనివాస్‌లను నియమిస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి నుంచి ఉత్తర్వులు వచ్చాయి. వీరంతా ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబును శనివారం నగరంలో ఎమ్మెల్యే స్వగృహం వద్ద మర్యాద పూర్వకంగా కలిశారు. వారికి ఎమ్మెల్యే చిట్టిబాబు పూల మాలలు వేసి శాలువాలతో సత్కరించారు. పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీ సొసైటీని అభివృద్ధి పథంలో నడిపించాలని ఎమ్మెల్యే చిట్టిబాబు ఈ సందర్భంగా అభిలషించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బాలం రమేష్, పార్టీ నేతలు పాలమూరి గోపాల్, వాసంశెట్టి చిన్నారి పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం



రాజోలులో బైపాస్ రోడ్డు నిర్మాణానికి పూజ చేస్తున్న ఎమ్మెల్యే రాపాక

రాజోలు: స్థానిక బైపాస్ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు శనివారం భూమి పూజ చేశారు. ప్రభుత్వం రూ.90 లక్షల నిధులు మంజూరు చేయడంతో రాజోలు ప్రధాన రహదారికి మోక్షం లభించింది. ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం రోడ్డు నిర్మాణానికి ఎలాంటి చర్యలు చేపట్టలేదని, ఆనాడు నోరు మెదపని కొందరు నాయకులు బైపాస్ రోడ్డు విషయంలో ప్రభుత్వంపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రస్తుతం సీసీ రోడ్డు నిర్మాణంతో అలాంటి నాయకులకు సమాధానం ఇస్తున్నామన్నారు. ఛిద్రమైన రోడ్డు నిర్మాణాలు చేపట్టేందుకు ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల ద్వారా ప్రతిపాదనలు పంపించామన్నారు. రాజోలు బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించడంపై స్థానిక వ్యాపారులు, నాయకులు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావుకు కృతజ్ఞతలు తెలిపారు. జెడ్పీటీసీ మట్టా శైలజ, ఏఎంసీ చైర్‌పర్సన్ గుబ్బల రోజారమణి, సర్పంచ్‌లు రేవు జ్యోతి, నక్కా రామారావు, కట్టా శ్రీనివాసరావు, ఎంపీటీసీలు చెల్లింగి లక్ష్మీఈశ్వరి, కొపనాతి పుష్పలత, పీఏసీఎస్ చైర్మన్ కూనపరెడ్డి రాంబాబు, దార్ల పెదబాబు, బందారు కాశీ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తూ.. సంక్షేమం వివరిస్తూ



కొమరాజులంకలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

రావులపాలెం: ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమాన్ని వివరిస్తూ మరోసారి ఆశీర్వదించాలని కోరుతూ మీ ముందుకు వచ్చానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి కోరారు. శనివారం మండలం కొమరాజులంక సచివాలయం–2 పరిధిలోని మల్లయ్యదొడ్డి ప్రాంతంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి సీఎం జగన్ ప్రభుత్వంలో అందించిన సంక్షేమ పథకాలను వివరించి సమస్యలు ఏమైనా ఉంటే తెలియచేయాలని వాటికి పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో రూ.1.81 కోట్లతో ఇంటింటికీ కుళాయి, అలాగే వాటర్ ట్యాంక్ నిర్మాణం పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. గ్రామ నడిబొడ్డున ఉన్న చెరువును పార్కుగా అభివృద్ధి చేసే పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. అలాగే మల్లయ్యదొడ్డి ప్రాంతంలో ఎప్పటినుంచో ఉన్న డ్రైనేజీ సమస్యను గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.20 లక్షలతో పరిష్కరిస్తామన్నారు. ఇన్ని పనులు చేసి చూపించిన వైఎస్సార్ సీపీకి ఓటు వేసి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యేగా తనకు మరోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, సర్పంచ్ గోవిందకృష్ణారెడ్డి, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొక్కా వెంకటలక్ష్మి, ఎస్సీ సెల్ నాయకుడు కోనాల రాజు, గ్రామ పార్టీ అధ్యక్షుడు గుర్రాల రాంబాబు, సెక్రటరీ వి.సబిత సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

షాపుల నిర్వహణకు టెండర్లు

రావులపాలెం: కొత్తపేట బస్టాండ్‌లో ఖాళీగా ఉన్న ప్రదేశంలో షాపుల స్థలం లీజుకు ఇచ్చేందుకు టెండర్లు పిలుస్తున్నట్టు డిపో మేనేజర్ కేడీఎంఎస్ కుమార్ శనివారం తెలిపారు. అనుమతి పొందిన వ్యాపారులు తమ వ్యాపారాలు నిర్వహించేందుకు రూ.295 చెల్లించి టెండరు ఫారాన్ని డిపో మేనేజర్ కార్యాలయంలో పొందాలన్నారు. పూర్తి చేసిన టెండర్ ఫారాలను ఆగస్టు ఎనిమిదో తేదీ మధ్యాహ్నం 2 గంటలలోపు రావులపాలెం డిపో మేనేజర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన టెండర్ బాక్స్‌లో వేయాలన్నారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు కొత్తపేట బస్‌స్టేషన్‌లో టెండర్ దారుల సమక్షంలో ఓపెన్ చేస్తామని డీఎం తెలిపారు.

శనైశ్చరునికి తైలాభిషేకాలు

కొత్తపేట: మండలంలోని మందపల్లిలో శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన ఉమా మందేశ్వర (శనైశ్వర) స్వామిని శనివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించి ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు నిర్వహించారు. స్వామి వారి ప్రాతఃకాల అర్చన అనంతరం భక్తులను తైలాభిషేకాలు, సర్వదర్శనాలకు అనుమతించారు. దేవస్థానం ఏసీ అండ్ ఈఓ సింగం రాధ, సిబ్బంది భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు. టికెట్లు, వివిధ సేవల ద్వారా రూ.97,089 ఆదాయం వచ్చినట్టు ఈఓ తెలిపారు. అలాగే అన్న ప్రసాద పథకానికి పలువురు భక్తులు విరాళాల రూపంలో మరో రూ.22,863 ఆదాయం వచ్చినట్టు ఈఓ తెలిపారు. సిబ్బంది, పలువురు గ్రామస్తులు అన్నప్రసాద సేవలో పాల్గొన్నారు.

సహకార సంఘాలకు ప్రభుత్వ ప్రాధాన్యం



రైతులకు వడ్డీ రాయితీ చెక్కు అందిస్తున్న పీఎస్ రాజు

ఆత్రేయపురం: సహకార సంఘాల ద్వారా ప్రభుత్వం రైతులకు ప్రాధాన్యమిస్తుందని ఆత్రేయపురం సహకార సంఘం అధ్యక్షుడు పీఎస్ రాజు అన్నారు. శనివారం స్థానిక విశాల సహకార పరపతి సంఘంలో ఆయన అధ్యక్షతన 169 మంది రైతులకు రూ.7,00,820 పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ 2020–21 సంవత్సరానికి సంబంధించి సరైన వాయిదాకు అప్పులు చెల్లించిన రైతులకు వడ్డీ రాయితీ పంపిణీ చేశారు. సహకార సంఘం ద్వారా రైతులు రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సంఘం సీఈఓ ముదునూరి రాంబాబు, రైతులు పాల్గొన్నారు.